మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



# ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు

## సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**సంగారెడ్డి మున్సిపాలిటీ మార్చి 5, ప్రభాతవార్త :**
జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. బుధవారం సంగారెడ్డి ఓల్డ్ బస్టాండ్ సమీపంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల లో ఏర్పాటుచేసిన ఇంటర్ పరీక్షల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకస్మికతనికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో బుధవారం నుండి ప్రారంభమైన ఇంటర్ పరీక్షల కోసం 54 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రథమ,ది ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలలో 34వేల 614 విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రకాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవిందరాం, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, సంబంధిత అధికారులు ఉన్నారు.

# పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు

## -జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**వెల్దుర్తి, మార్చి 5 ప్రభాతవార్త:**
పాడి పశువులకు ఎలాంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు, వ్యాక్సినేషన్‌లు చేయాలని పశు వైద్య అధికారులకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. బుధవారం మాసాయిపేట మండలంలో ఉన్న పశు వైద్యశాలన కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ వైద్యులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. పశువులకు వ్యాధులు రాకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పశువులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. పశు వైద్యశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పాడి పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

# కొల్చారం మండలంలో డిఇవో పర్యటన

**కొల్చారం, మార్చి 5 ప్రభాతవార్త:** కొల్చారం మండలంలో బుధవారం మండల ప్రత్యేక అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రాధా కిషన్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కొల్చారంలోని టీజీడబ్ల్యూ ఆర్ఐఈఎస్ పాఠశాల, కేజీబీవీ పాఠశాల, బీసీ హాస్టల్, రంగంపేట ఎస్సీ హాస్టల్‌లను సందర్శించి విద్యార్థినీ విద్యార్థులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రాధా కిషన్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్యను అందించాలని,నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలని, తరగతి గదులు విద్యార్థులను ఆకర్షించే విధంగా ఉండాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని, వంటకు నాణ్యమైన సరుకులు, కూరగాయలను మాత్రమే వినియోగించాలన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందివ్వాలన్నారు.మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాలలు, హాస్టల్ పరిసరాలలో దోమలు వ్యాపించకుండా చెత్తను శుభ్రపరచాలని, అన్ని రకాల రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిని పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, సీఆర్పీ సాయి కుమార్, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# మంజీరా వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం చైర్మన్‌గా వెంకట్రామిరెడ్డి

**కొల్చారం, మార్చి 5 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సంగాయిపేట గ్రామంలోని మంజీరా వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం నూతన పాలకవర్గాన్ని సంఘ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. సొసైటీ ఆవరణలో సొసైటీ చైర్మన్‌గా సంగాయిపేట గ్రామానికి చెందిన ముత్యంగారి వెంకట్రామిరెడ్డిని నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ ముత్యంగారి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ తనను సొసైటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ అభివృద్ధి ఎల్లవేలళా కృషి చేస్తానని తెలిపారు.

# 31వ తేదీలోగా ఎల్ఆర్ఎస్ చెల్లించిన వారికి 25 శాతం రాయితీ : మున్సిపల్ కమిషనర్ దేవేందర్

**రామాయంపేట మున్సిపాలిటీ, మార్చి 5, ప్రభాతవార్త :** ఈనెల 31వ తేదీ లోగా ఎల్ఆర్ఎస్(ఇంటి స్థలముల క్రమబద్ధీకరణ) రుసుము చెల్లించినట్లయితే ఫీజులో 25 శాతం రాయితీ కల్పించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2020 సంవత్సరంలో రూ.1000 చెల్లించి ఎల్ఆర్ఎస్‌కు రిజిస్టర్ చేసుకున్న ప్లాటు యాజమానులకు రాష్ట్ర ప్రభుత్వం జీవోఎంఎస్ నం. 28 ప్రకారం, మార్చి 31, 2025 లోగా పూర్తి ఫీజు చెల్లించిన వారికి ఈ 25 శాతం రాయితీ లభిస్తుందన్నారు. కావున మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఇట్టి సదావకాశాన్ని సద్వినియోగం చేసుకొని, మీ ప్లాటును క్రమబద్ధీకరించుకోవాలని కోరారు.

# జిల్లాలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో విద్యాబోధన అమలు

## -మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**వెల్దుర్తి, మార్చి 5 ప్రభాతవార్త:** జిల్లాలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో విద్యాబోధన కార్యక్రమం పక్కాగా అమలుచేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మెదక్ జిల్లా మాసాయిపేట మండలంలో బుధవారం కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో విద్యాబోధన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విద్యాబోధన కార్యక్రమం గురించి కలెక్టర్ విద్యార్థినీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలోని 6 ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విద్యాబోధన కార్యక్రమం అమలు జరుగుతున్నట్లు వివరించారు. తెలుగు చదవడం, ఇంగ్లీషులో చదవటం, మాట్లాడడం, గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించి తప్పొప్పులను సరి చేసుకుంటూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్‌తో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాథమిక పాఠశాలలో అమలు సత్ఫలితాలు దిశగా ముందుకు పోతుందని, ఈ స్పందనను దృష్టిలో పెట్టుకొని వచ్చే సంవత్సరం మరిన్ని పాఠశాలల్లో అమలు జరిగేలా చర్యలు చేపడతామన్నారు. ఫౌండేషన్ లెర్నింగ్ వారికి సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే దృఢ సంకల్పంతో ముందుకు పోతున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ వివరించారు. అనంతరం కలెక్టర్ అంగన్వాడీ సెంటర్‌ను పరిశీలించారు. చిన్నారులందరికీ నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలన్నారు. ఈ సందర్భంగ మాట్లాడుతూ అంగన్వాడీలలో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలని కోరారు. అంగన్‌వాడీల్లో తరగతి గదులు చిన్నారులను ఆకర్షించే విధంగా ఉండాలన్నారు. చిన్నారులకు అధికసంఖ్యలో ఆట వస్తువులు, బొమ్మలు అందుబాటులో ఉంచాలన్నారు. పిల్లలకుమెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని, వంటకు నాణ్యమైన సరుకులను, కూరగాయలను మాత్రమే వినియోగించాలన్నారు. అంగన్‌వాడీ చిన్నారుల స్వచ్ఛమైన తాగునీరు అందివ్వాలన్నారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉండాలన్నారు. అంగన్వాడీ పరిసరాలలో దోమలు వ్యాపించకుండా చెత్తను శుభ్రపరచాలని, చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువును నేర్పించాలని చెప్పారు. అన్ని రకాల రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. గర్భిణుల ఆరోగ్య స్థితిని పర్యవేక్షిస్తూ పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నారుల తల్లిదండ్రులతో నెలవారీగా సమావేశాలు ఏర్పాటు చేసి పిల్లల ఆరోగ్య స్థితిని తెలుసుకోవాలని సూచించారు. ఎత్తు, బరువు వివరాలకు సంబంధించిన చిన్నారుల రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిలతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

# ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి



ఇంటర్మీడియట్ పరీక్షల సరళిని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలో ఇంటర్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు పరీక్షా సమయానికి కంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు.పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 43 పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు 10542 మంది విద్యార్థులు పరీక్ష రాయల్సి ఉండగా 9976 మంది విద్యార్థులు హాజరు కాగా 566 మంది హాజరు కాలేదు. ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు పరీక్ష నిర్వహించారు.

**పరీక్ష కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్...**

జిల్లాలో ప్రారంభమైన ఇంటర్ వార్షిక పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రగతి జూనియర్ కాలేజ్, న్యూజనరేషన్ జూనియర్ కాలేజీ, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి పరిశీలించారు. పరీక్ష కేంద్రాలలో ఏర్పాటు చేసి వసతులను పరిశీలించారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రతి పరీక్ష కేంద్రం వద్ద తాగునీరు ఏర్పాటు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట ఇంటర్మీడియట్ జిల్లా అధికారి రవీందర్‌రెడ్డి ఉన్నారు. కాగా జిల్లాలోని పరీక్ష కేంద్రాలవద్ద 163 బిఎన్ఎస్ఎస్ 2023 సెక్షన్ అమలు చేశారు.

**పరీక్ష కేంద్రాలను పరిశీలించిన సిపి అనురాధ**

జిల్లాలోని ఇంటర్ పరీక్ష కేంద్రాలను సీపీ డాక్టర్ అనురాధ బుధవారం పరిశీలించారు. ఎన్సాన్‌పల్లి తెలంగాణ రెసిరెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్ బాయ్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోస్తు ఏర్పాటు చేయాలని అధికార్లులను ఆదేశించారు.

**మెదక్ జిల్లాలో...**

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 5 ప్రభాతవార్త:**
జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాల, టీజీఆర్ఎస్‌లో ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షల సరళిని బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పనితీరు, స్క్రైబ్ విధానం గురించి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని, పరీక్ష మొదటి రోజు 6410 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 6,180 మంది పరీక్షకు హాజరయ్యారని, 230 మంది వివిధ కారణాల వల్ల పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు. పరీక్షా కేంద్రంలో తాగునీటి వసతి, మెడికల్ సిబ్బంది, మూత్రశాలలు, అందుబాటులోఉన్న సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. సరిపడా ఔషధాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలను నిర్వహించాలని, పరీక్ష పూర్తయిన వెంటనే జవాబు పత్రాలను పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత ప్రాంతాలకు తరలించాలని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రంలోకి అనుమతించాలని, ఎలక్ట్రానిక్ గడియారాలు, మొబైల్ ఫోన్‌ల వంటి ఉపకరణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించ కూడదని సూచించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 31వ తేదీలోగా అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణ

## సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి మున్సిపాలిటీ మార్చి 5, ప్రభాతవార్త:**
అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణకు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకుంటే 25శాతం రాయితీ లభిస్తుందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు.బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో హెచ్ఎండిఏ పరిధి, జిల్లాలోని మున్సిపాలిటీల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణలో అనుమానాలు ఇబ్బందులు ఎదురైతే సంబంధిత మున్సిపల్ కార్యాలయాల్లోని హెల్ప్ డెస్కలో సంప్రదించాలని జిల్లాలోని అర్హులైనవారు గడువులోగా ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. గత సెప్టెంబర్ 2024 లో ప్రభుత్వం జారి చేసిన మార్గదర్శకాలు ప్రకారం కొన్ని దరఖాస్తులు క్రమబద్ధీకరణ జరిగినట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకుందన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

ఎల్ఆర్ఎస్ ప్లాస్ట్ రిజిస్ట్రేషన్ సమయంలో కుసుమ చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చన్నారు. ఎల్లారాస్ దరఖాస్తు ఆమోదించే వాటికి మార్చి 31వ తేదీ వరకు కనుబద్ధీకరణ చేసుకుంటే చెల్లించాల్సిన రుసుములు 25 మినహాయింపు ఉంటుందన్నారు. సబ్ రిజిస్టర్ ద్వారా నిర్ణీత నమూనాలో నూతన దరఖాస్తులు స్వీకరించి ఎల్ఆర్ఎస్ కోసం మునిసిపల్ శాఖకు వివరాలు పంపించి క్రమబద్ధీకరిస్తారన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు. ఈనెల 31 వరకు ప్రభుత్వ అందించిన అవకాశాన్ని వినియోగించుకొని 25 రాయితీ పొందాలి అన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలలో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు ప్రాపర్టీ టాక్స్ వసూలు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని 12 మున్సిపాలిటీల అధికారులు బిల్లుకలెక్టర్లతో ప్రతిరోజు రివ్యూ నిర్వహించాలన్నారు. ప్రాపర్టీ టాక్స్ వాటర్ బిల్స్ 100 వసూలు చేయాలన్నారు బిల్ కలెక్టర్‌లు రోజువారి టార్గెట్ పూర్తి చేయాలన్నారు. టార్గెట్ పూర్తిచేయని మున్సిపల్ సిబ్బందికి మెమోలు తప్పవని హెచ్చరించారు. పన్నుల వసులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కొత్తగా ఏర్పాటు అయిన 4 మున్సిపాలిటీలలో జిపి ల నుండి అసెస్మెంట్‌కు సంబంధించిన రికార్డులన్నీ స్వాధీనం చేసుకోవాలన్నారు. హెచ్ఎండిఏ పరిధి చెరువులు, కుంటల ఆన్లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఆన్లైన్ ప్రక్రియకు సంబంధించి ప్రైమరీ, తుది జాబితాను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్ ,నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు,టౌన్‌ప్లానింగ్ అధికారులు సర్వే ల్యాండ్ రికార్డ్ అధికారులు, తహసీల్దార్లు, మునిసిపల్ అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ గదరాజు చందును అభినందించిన కెసిఆర్

**చేర్యాల, మార్చి 5,ప్రభాతవార్త :** చేర్యాల మండలం కడవేర్గు గ్రామానికి చెందిన డాక్టర్ గదరాజు చందు ఇటీవల ఓయూ ప్రొఫెసర్ ఎం.గోనానాయక్ పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్రంలో దొమ్మర కులస్థుల సంస్కృతి,సాహిత్య పరిశీలన అంశంపై పరిశోధన పూర్తి చేసి ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందిన సందర్భంగా బుధవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కేసిఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. సంబంధిత సిద్ధాంత తొలి గ్రంధాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతో మాజీ సీఎం కేసిఆర్‌కు చందు అందజేసి పరిశోధన విషయాలను వివరించారు.అనంతరం కేసిఆర్ స్పందిచి మాట్లాడుతూ తెలంగాణ ఆదిహిందూ జాతికులాల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత తెలంగాణ బిడ్డలపై ఉందని, గ్రామీణ ప్రాంతబిడ్డగా అరుదైన పరిశోధన జరిపిన చందును కేసిఆర్ అభినందించారు.కలిసినవారిలో రాళ్లబండి చందు,బొంగురం జితేందర్‌రెడ్డి ఉన్నారు.



కెసిఆర్‌కు గ్రంధాన్ని అందిస్తున్న చందు,పక్కన ఎమ్మెల్యే పల్లా

# రంగనాయకసాగర్‌లోకి నీటి ఎత్తిపోతలు ప్రారంభం

## ఫలించిన హరీష్‌రావు కృషి

**చిన్నకోడూరు, మార్చి 5, ప్రభాతవార్త :**
మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్ మీదుగా రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ల్లోకి నీటిని ఎత్తిపోయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఇటీవల నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. దీనికి స్పందించకపోవడంతో ఆయన ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి రైతుల కష్టాలను వివరించారు. సాగునీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని హరీష్‌రావు వివరించచడంతో వెంటనే స్పందించిన ప్రభుత్వం బుధవారం అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయకసాగర్‌లోకి గోదావరి జలాలు ఎత్తిపోయడం ప్రారంభించారు. రంగనాయకసాగర్‌లోకి 1 టిఎంసి నీటిని ఎత్తిపోతలు ప్రారంభించడంతో సిద్దిపేట నియోజకవర్గంలోని రైతుల కష్టాలు తీరనున్నాయి. ఎస్సారెస్పీ స్టేజ్ 2లో తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట, భూపాలపల్లి ప్రాంతంలో పంటలు ఎండిపోతున్నాయి

**రంగనాయకసాగర్‌ను సందర్శించిన హరీష్‌రావు**

చిన్నకోడూరు మండల పరిధిలోని చంద్లాపూర్ రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు సందర్శించారు. రంగనాయకసాగర్‌లోకి 1 టిసిఎంల నీటిని విడుదల చేసినందుకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.నియోజకవర్గంలో 50 వేల ఎకరాల్లో పంట సాగవుతుందని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన మంచి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం తుడిచిపెట్టాలని చూస్తుందని ప్రజలకు నష్టం చేయొద్దన్నారు. ఎస్సారెస్పీ స్టేజ్‌లో 2లో తుంగతుర్తి, కోదాడ, సూర్యపేట భూపాలపల్లి ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. గతంలో ఎస్సారెస్పీ నీరు తగ్గినప్పటికి కాళేశ్వరం ద్వారా రెండు పంటలకు సాగునీరు అందించామని తెలిపారు. కాళేశ్వరంలో 15రిజర్వాయర్లు..203 కిలోమీటర్ల టన్నెల్లు, 19 సబ్ స్టేషన్లు, 21 హౌసులు బాగున్నాయని తెలిపారు. మేడిగడ్డలో ఏడు బ్లాకులుంటే అందులో ఒక బ్లాక్‌లో ఒక పిల్లర్ మాత్రమే కుండిపోయిందన్నారు. కాంగ్రెస్ సర్కారు గోరంతను కొండంత చేసి బిఆర్ఎస్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచిపోతున్నా మేడిగడ్డలో కుంగిన పిల్లర్లను బాగు చేసే తీరిక లేదన్నారు. గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయని.. ఆ నీటిని లిఫ్ట్‌చేసి లక్షల ఎకరాల పంటలను కాపాడే అవకాశం ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న పంట కాలువల పనులు పూర్తి చేయాలన్నారు. కాళేశ్వరం కుంగింది అన్నవారు ఈ నీళ్లు ఎక్కడినుంచి వచ్చాయో చెప్పాలన్నారు. కాళేశ్వరం తెలంగాణ వరప్రదాయిని న్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు కళ్లు తెరవాలని లేదంటే చరిత్ర మిమ్ములను క్షమించదన్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.



రంగనాయకసాగర్‌ను పరిశీలిస్తున్న హరీష్‌రావు

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## -జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 5 ప్రభాతవార్త:** రాజీమార్గమే రాజమార్గం అనే సూత్రాన్ని అనుసరించి, వివాదాలను చక్కదిద్దుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ అద్భుతమైన అవకాశం అని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివాదాలు ఒకసారి ప్రారంభమైతే జీవితాంతం కొనసాగుతూనే ఉంటాయని, కానీ వాటిని త్వరగా పరిష్కరించుకోవాలని నిర్ణయించుకుంటే శాంతి సాధ్యమవుతుందన్నారు. ఉచిత న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మార్చి 8వ తేదీన కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని, కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఎలాంటి కేసులు రాజీ పడవచ్చు, జాతీయ లోక్ అదాలత్ ద్వారా తక్షణమే పరిష్కరించుకోవచ్చని ఎస్పీ పేర్కొన్న కేసులు.. 1. యాక్సిడెంట్ కేసులు 2. చీటింగ్ (మోసం) కేసులు 3. కొట్టుకున్న కేసులు 4. వివాహ బంధానికి సంబంధించిన కేసులు 5. చిన్న చిన్న దొంగతనం కేసులు 6. కరోనా సమయంలో నమోదైన కేసులు 7. డ్రంక్ అండ్ డ్రైవ్ (మద్యం మత్తులో వాహనం నడిపిన కేసులు) 8. ఇతర రాజీపడదగిన కేసులు, కోర్టుకు ఎలా హాజరు కావాలి.. 1. మీకు తెలిసిన వ్యక్తులపై ఏమైనా కేసులు ఉంటే, వీటిని జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడానికి ఫిర్యాదు దారుడు, నిందితుడు ఇద్దరూ కోర్టుకు హాజరుకావాలి. 2. తమ ఆధార్ కార్డు తీసుకుని సంబంధిత కోర్ట్ లేదా నిర్ణీత ప్రదేశంలో హాజరు కావాలి. 3. కోర్టులో హాజరైన వెంటనే రాజీ ప్రక్రియను పూర్తి చేసి కేసును పూర్తిగా ముగించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా లాభాలు.. కేసుల తక్షణ పరిష్కారం, సంవత్సరాల తరబడి సాగే న్యాయపరమైన చికాకుల నుంచి విముక్తి సంఖ్యాబద్ధ (ఫార్మల్) కోర్టు ప్రక్రియ అవసరం లేదు. 1. లీగల్ ఫీజు, కోర్టు ఖర్చుల తగ్గింపు 2. సులభమైన, తక్కువ ఖర్చుతో కూడిన శాంతి సాధన మార్గం 3. ప్రతిరోజూ కోర్టుకు తిరగాల్సిన అవసరం లేకుండా సమస్యను ఒకే రోజు పరిష్కరించుకునే అవకాశం జాతీయ లోక్ అదాలత్ బాధితులకు మంచి అవకాశం అని ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. కేసులలో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శాంతి, న్యాయం పొందాలని సూచించారు.

# క్రీడా పోటీలతో మహిళల్లో ఆత్మవిశ్వాసం

## జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



క్రీడలను ప్రారంభిస్తున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి మున్సిపాలిటీ మార్చ్ 5 ప్రభాతవార్త :** క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. మహిళా దినోత్సవం మార్చి 8ని పురస్కరించుకొని ముందస్తుగా జిల్లాలోని మహిళా ఉద్యోగులకు కలెక్టర్ ఆదేశాల మేరకు టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో వివిధ అంశాలలో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాపోటీలను ప్రారంభించారు. మహిళలతో కలిసి పోటీలో పాల్గొని చెస్, క్యారమ్స్ ఆడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహిళా ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల మహిళల్లో ఆత్మ విశ్వాసం పొందడంతో పాటు మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. ఈ క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి మార్చి 8 మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బహుమతులు అందజేయున్నట్లు కలెక్టర్ తెలిపారు. మహిళా ఉద్యోగులకు రన్నింగ్, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, క్యారమ్స్, టెన్నికాయిట్, స్లో అండ్ ఫాస్ట్ వాక్, బ్లోయింగ్ బెలూన్స్ తదితర క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మజ, సెంట్రల్ యూనియన్ కార్యదర్శిలు నిర్మల రాజకుమారి, టిఎన్జీవో సంగారెడ్డి జిల్లా కార్యదర్శి వేల్పూర్ రవి ,అసోసియేట్ అధ్యక్షుడు కసిని శ్రీకాంత్, వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ గౌస్ ,సెంట్రల్ యూనియన్ ఆఫీస్, జిల్లా టీఎన్జీవో కార్యవర్గ సభ్యులు, జిల్లా అధికారులు ,మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఫైరింగ్ రేంజ్ పనులను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 5 ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన నార్సింగి గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న ఫైరింగ్ రేంజ్ పనులను జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. ఫైరింగ్ ప్రాక్టీస్ కొరకు వేరే జిల్లాలోని ఫైరింగ్ రేంజ్‌కు వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. ఫైరింగ్ రేంజ్ లేని లోటును పూర్తి చేసి, ఫైరింగ్ రేంజ్‌ను సిబ్బందికి త్వరగా అందుబాటులోకి తేవడానికి కృషి చేయాలని అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పీ వెంకట్ రెడ్డి, ఏఆర్ డిఎస్పీ రంగ నాయక్, రామాయంపేట్ సీఐ వెంకట రాజాగౌడ్, తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, ఆర్ఐ శైలేందర్, ఎస్ఐలు పాల్గొన్నారు.



ఫైరింగ్ రేంజ్ పనులను పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

# పట్టణంలో చెడ్డి గ్యాంగ్ ముఠా హల్‌చల్

## -భయాందోళనలో పట్టణ వాసులు

**జహీరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:**
చెడ్డిగ్యాంగ్ ముఠా మంగళవారం రాత్రి పట్టణంలోని సాయి రామ్ నాగర్ కాలనీలో అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న ఇంటిలో దోపిడికి వచ్చి హల్‌చల్ సృష్టించారు. చెడ్డిగ్యాంగ్ దొంగతనానికి యత్నించిన దృశాలు సిసి కెమెరాల్లో రికార్డు అయ్యాయి. 5 నుంచి 6 మంది చెడ్డిగ్యార్ ముఠా దొంగతనానికి యత్నించినట్లు టివిలో, సామాజిక మాధ్య మల ద్వారా తెలుసుకున్న పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల మరింత భద్రత పెంచాలని, పెట్రోలింగ్ పెంచాలని పట్టణ ప్రజలు వినతి చేస్తున్నారు.



పట్టణంలో దొంగతనానికి వచ్చిన చెడ్డిగ్యాంగ్ ముసుగు దొంగల ముఠా

# డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ


మాట్లాడుతున్న ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ కె. రాజయ్య

**గుమ్మడిదల, మార్చి 5 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని నల్లవల్లి పంచాయతీ పరిధిలో ప్యారా నగర్ పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలంటూ నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల ప్రజలతో సంతకాల సేకరణ కార్యక్రమం ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ కె. రాజయ్య హాజరై రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ వల్ల చుట్టుపక్కల గ్రామాలకు ఎలాంటి నష్టం వాటిల్లదని రాష్ట్ర ప్రభుత్వం గానీ, రామ్‌కీ సంస్థ గాని బహిరంగ చర్చకు సిద్ధమై రావాలని సవాలు విసిరారు. ఈ ప్రాంత ప్రజలకు ఎటువంటి నష్టం లేకపోతే ప్రభుత్వం చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఒప్పించి మెప్పించే ప్రయత్నం ఎందుకు చేయడం లేదన్నారు. రామ్‌కీ సంస్థ చెబుతున్నవి పచ్చి అబద్ధాలని, గతంలో జవహర్ నగర్ ప్రాంతంలో ఇలాంటివి ఎన్నో తప్పుడు అబద్ధాలు చెప్పి డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసినప్పటికీ 20 కిలోమీటర్ల మేరకు నష్టం వాటిల్లుతుందని, ఆ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను సీపీఎం పార్టీ బృందం ప్రత్యేకంగా ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించిందని అన్నారు. సుమారు 380 ఎకరాలలో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి ఆ ప్రాంత ప్రజలకు తాగునీరు, వాతావరణ కాలుష్యంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మురుగువాసనతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఎన్నో వ్యాధుల బారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్యారానగర్ ఈ ప్రాంతం వ్యవసాయ ఆధారిత ప్రాంతం, పచ్చని పల్లె వాతావరణం అని, ఈ ప్రాంత ప్రజలు, రైతులు వాస్తవాలు తెలుసుకొని డంపింగ్ యార్డ్ ఏర్పాటును నిరసిస్తూ బుధవారం నాటికి 29 రోజులుగా నిరవధిక సమ్మెలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు దిగి రావడం లేదని ప్రశ్నించారు. సామరస్యంగా, శాంతియుతంగా చేస్తున్నటువంటి నిరవధిక సమ్మెలకు దిగి రాకపోతే రానున్న అసెంబ్లీ సమావేశాల్లోపు ప్రభుత్వ అధికారులు స్పందించి డంపింగ్ యార్డ్ ఏర్పాటును రద్దు చేసేదిశగా చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. లేని పక్షాన అసెంబ్లీ ముట్టడికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. గతంలో ఎర్రజెండా పోరాటాలతోనే సమస్యలు పరిష్కరించుకున్నమన్నారు. నేడు మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసుకున్న మండల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో, సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ కోరనున్నామని, వారు నిరాకరిస్తే అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల పోరాట వేదిక నాయకులు నర్సింలు, నాగేశ్వరరావు, రాజయ్య, మల్లేష్ గౌడ్, రామకృష్ణ, అంజనేయులు పాల్గొన్నారు.


ఎన్నికైన రైతు సంఘం నూతన కార్యవర్గం

## గుమ్మడిదల రైతు సంఘం నూతన కార్యవర్గం

**గుమ్మడిదల, మార్చి 5 ప్రభాతవార్త:** మండలంలోని రైతు సంఘం నూతన కార్యవర్గ అధ్యక్ష ఎన్నిక గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నూతన అధ్యక్షులుగా అమ్మగారి సదానందరెడ్డిని ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షుడుగా మద్దుల మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కావాలి ఆనంద్ యాదవ్, సంజీవరెడ్డి, ముత్యాల రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంఘం కుమార్ యాదవ్, జైపాల్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా కాలకంటి కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, కుమార్‌యాదవ్, కోశాధికారి మైపాల్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా నంద్యాల రామిరెడ్డి, రామిరెడ్డి, బుచ్చిగారి బాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా పి.మోహన్‌రెడ్డి, విభీషణ్, కార్యవర్గ సభ్యులుగా మద్దెటి నరసింహులు, నారాయణ యాదవ్, డప్పు శ్రీను, నీరుడు శ్రీను, నల్ల కంటి బాలశెట్టిలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షులు సదానంద రెడ్డి మాట్లాడుతూ రైతులు తన మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతులు అభివృద్ధి చెందే విధంగా తగు సూచనలు పాటిస్తూ రైతుల కష్టాలను ఉన్నత అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లి అనునిత్యం రైతుల అభివృద్ధికి దోహదపడతానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## హరీష్‌రావు చొరవతో గోదావరి జలాలు

**గజ్వేల్ టౌన్, మార్చి 5,ప్రభాతవార్త :** మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు చొరవతో జిల్లాలోని రిజర్వాయర్‌లోకి అధికారులు నీటిని విడుదల చేశారని గజ్వేల్ మాజీ జెడ్పీటీసి పంగ మల్లేశం తెలిపారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల కష్టాలను చూసి చలించిపోయిన హరీష్‌రావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల అయ్యేలా కృషి చేశాడని తెలిపారు. అన్నపూర్ణ రిజర్వాయర్ మీదుగా రంగనాయక సాగర్ రిజర్వాయర్లకు తక్షణమే నీటిని విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌కు లేక రాసిన పట్టించుకోకపోవడంతో ఫోన్ చేసి రైతుల పరిస్థితిని క్షుణ్ణంగా వివరించారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని, ఎందుకు పనికి రాదని విమర్శలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వమే నేడు అదే కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు అన్నపూర్ణ రిజర్వాయర్ నుండి రంగనాయక సాగర్‌లోకి గోదావరి జలాలను ఎత్తిపోయడం ప్రారంభించారని తెలిపారు. ఇప్పటికైన అబద్దాలతో ప్రభుత్వ పాలన చేయకుండా కళ్ళు తెరిచి ప్రజల బాగోగులు చూడాలని అన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ మొదటి రోజు పరీక్షలు

**చిన్నశంకరంపేట, మార్చి 5,ప్రభాతవార్త:** ఇంటర్ ప్రథమ సంవత్సర వార్షిక పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం మొదటి రోజు పరీక్షకు 325 మందికి గాను 319 విద్యార్థులు హాజరయ్యారని, 6గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంచార్జి ప్రిన్సిపల్ భూపాల్‌రెడ్డి తెలిపారు.

## సిఎం సలహాదారుడిని కలిసిన శివప్ప


సిఎం సలహాదారులు వేము నరేందర్‌రెడ్డిని కలిసిన శివప్ప తదితరులు

**సిద్దిపేట రూరల్, మార్చి 5, ప్రభాతవార్త :** సిఎం సలహాదారులు వేము నరేందర్‌రెడ్డిని బుధవారం హైదారాబాద్‌లోని ఆయన స్వగృహంలో జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్‌తో కలిసి మర్యాదపూర్వకంగా కలిసినట్లు సిద్దిపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరకుల శివప్ప తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు,సిద్దిపేట నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై సిఎం సలహాదారులు వేము నరేందర్‌రెడ్డి చర్చించినట్లు ఆయన తెలిపారు.

## మల్లం రాజు సేవలు చిరస్మరణీయం

### కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి


మల్లం రాజు విగ్రహాన్ని ఆవిష్కరించిన తూంకుంట నర్సా రెడ్డి

**గజ్వేల్, మార్చి 5 (ప్రభాతవార్త):** దివంగత మల్లం రాజు చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామంలో మల్లం రాజు విగ్రహాన్ని అతని సతీమణి సుమతితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లం రాజు ఎంపిపిగా, సర్పంచ్‌గా పేద ప్రజలకు ఎన్నో సేవలు అందించారన్నారు. కొల్గూరు గ్రామ సర్పంచ్‌గా ఉండి గ్రామాభివృద్ధికి ఎంతో తోడ్పాటునందించారని, ప్రజలకు ఏ కష్టం వచ్చినా క్షణంలో అక్కడికి చేరి వారి సమస్యలను పరిష్కరించేవారని, అలాంటి మనిషి లేనిలోటు తీర్చలేనిదన్నారు. భవిష్యత్తులో మల్లం రాజు ఆశయాలను కొనసాగించేవిధంగా ఆయన సతీమణి సుమతి ముందుకు వెళ్ళాలన్నారు. అనంతరం మల్లం రాజు సతీమణి సుమతి మాట్లాడుతూ నా భర్త పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారని, ఆయన ఆలోచనకు తగ్గట్టుగా ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ తంగెళ్లపల్లి ప్రభాకర్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, మాజీ కౌన్సిలర్లు సుభాష్‌చంద్రబోస్, షహనాజ్ సమీర్, కొనమైన కన్నాయాదవ్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, జంగం రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావు చొరవతో కాళేశ్వరం జలాల విడుదల

**గజ్వేల్, మార్చి 5 (ప్రభాతవార్త):** తెలంగాణలో రైతుల కష్టాలను చూసి చలించిపోయి ప్రభుత్వం దృష్టికి మాజీ మంత్రి హరీష్‌రావు తీసుకెళ్ళడంతో వెంటనే అధికారులు నీటిని విడుదల చేశారని గజ్వేల్ మాజీ జెడ్‌పిటిసి పంగ మల్లేశం పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం జలాలతో పంటపొలాల దాహార్తిని తీర్చిన మహనీయుడు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. గత ప్రభుత్వంలో కాళేశ్వరం జలాలతో పంటలు పుష్కలంగా పండాయని, నేడు నీరు లేక పంటపొలాలు ఎండిపోతున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రైతుల పక్షాన మాజీ మంత్రి హరీష్‌రావు చేసిన పోరాటం ఫలించిందని, అన్నపూర్ణ రిజర్వాయర్ మీదుగా రంగనాయకసాగర్ రిజర్వాయర్లకు తక్షణమే నీటిని ఎత్తిపోయాలని ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాయగా లేఖకు స్పందించకపోవడంతో ఫోన్‌చేసి మాట్లాడి రైతుల కష్టం గురించి క్షుణ్ణంగా చర్చించారు. వందల ఎకరాలలో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయమని, అబద్ధపు మాటలు చెప్పి ఆరు గ్యారంటీలతో గద్దెనెక్కిన ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

# కన్నుల పండుగగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం


విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, మార్చి 5 (ప్రభాతవార్త):**
రెండు రోజుల నుండి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో శ్రీమహంకాళమ్మ, శ్రీ పెద్దమ్మ, శ్రీనల్లపోచమ్మ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్టమహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 8.30 గంటల నుండి గురుప్రార్థన, గోపూజ, శాంతిపటం, స్థాపిత దేవతా ప్రాతఃకాల పూజ, జప పారాయణాదులు, స్థాపిత దేవతా పూజ, ప్రధాన దేవతా మూలమంత్ర హవనములు, స్నపనం, ధాన్యాధివాసం, హవనములు, ప్రోదషకాల పూజ, శయ్యా, పుష్ప, ఫలాధి వాసములు, హారతి, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి 8 గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. కాగా మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, స్థానిక మాజీ కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మి కనకయ్య, పంబాల అర్చన శివకుమార్‌లు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవంలో ప్రజ్ఞాపూర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయగా భక్తులకు సహపంక్తి భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో త్రిశక్తి ఆలయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రొట్టెల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కదుల్ల ఎల్లేశం, కోశాధికారి శ్రీరాం కృష్ణ, ఉపాధ్యక్షుడు కదుల్ల దేవేందర్, సంయుక్త కార్యదర్శి ఎల్ల శ్రీనివాస్, ఎల్ల మల్లేశం, ఎల్ల వెంకటేష్,పూదరి రాజలింగం, శ్రీరాం ముత్యాలు, బోయిని కుమార్, కాటు కల్యాణ్, కాటు పెద్దరాజు, చిన్నరాజు, గుంటుకు శిరీష రాజు, మాజీ ఉపసర్పంచ్ కుర్రె సాయిరెడ్డి, త్రిశక్తి ఆలయ విగ్రహాల దాతలు నందాసు శాంతివీర్, ఇందిర ప్రభాకర్, రజక సంఘం అధ్యక్షుడు మెతుకు నర్సింలు, తుమ్మ నర్సింలు, మారగోని మల్లేశంగౌడ్, చెక్కిల్ల శ్రీనివాస్‌గౌడ్, శ్రీరాం మల్లేశం, ఎక్కలదేవ్ కనకరాజు, మన్నె వెంకటేష్, ఎల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డ పెళ్లికి పట్టుచీర కానుక

**నర్సాపూర్, మార్చి 5, ప్రభాతవార్త :** నర్సాపూర్ మండల పరిధిలోని తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన గొట్టిముక్కుల ఎల్లయ్య కల్పనా దంపతుల కుమార్తె అవంతి వివాహానికి మెదక్ జిల్లా బిజెపి పార్టీ మహిళ మోర్చా ప్రధాన కార్యదర్శి కవిత రెడ్డి పట్టుచీరను అందజేశారు. ఈ సందర్భంగా కవితారెడ్డి మాట్లాడుతూ పేదింటి ఆడపిల్ల పెళ్ళిళ్ళకు ఏదైనా తన వంతు సహాయం చేయాలని సంకల్పించానని తెలిపారు. ఈమేరకు నర్సాపూర్ మండలంలోని రుస్తుంపేట్, ఆద్మాపూర్ తదితర గ్రామాల్లో పలువురి పేదింటి ఆడపిల్ల లకు పట్టు చీరెలతో పాటు ఆర్థికంగా సహాయాన్ని అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కుమార్, శక్తి కేంద్రం ఇంచార్జి కుకునూరి యాదగిరి, గొట్టిముక్కుల శాంసన్, బర్ల మల్లేష్, అక్కపల్లి మల్లేశం, చంద్రశేఖర్, దత్తు, ప్రవీణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నల్ల పోచమ్మ ఆలయం ఆదాయం రూ.11.72 లక్షలు

**కౌడిపల్లి, మార్చి 5, ప్రభాతవార్త :**
కౌడిపల్లి మండల పరిధిలోని తునికి గ్రామ శివారులో గల శ్రీ నల్లపోచమ్మ ఆలయం వద్ద సంవత్సర కాలం పాటు నాలుగు (మడిగలు) షాపులను నడుపుటకు ఇంచార్జ్ ఈవో రంగారావు ఆధ్వర్యంలో బుధవారం నాడు బహిరంగంగా వేలం వేయగా రూ.11.72, లక్షలు ఆదాయం రావడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్చార్జి ఏవో రంగారావు మాట్లాడుతూ మొదటి మడిగే 3 లక్షల15 వేలకు చిన్న నర్సాగౌడ్, రెండవ మడిగే 3 లక్షల 13వేలకు పెద్ద నర్స గౌడ్, మూడవ మడిగే 3 లక్షల 14 వేలకు, నాలుగవ మడిగే 2 లక్షల 30 వేలకు రాణమ్మ వేలం పాట పాడి కైవసం చేసుకున్నారు. మార్చి నెల లో జరిగిన కొబ్బరికాయలు టెంట్ హౌస్ వెహికిల్ పార్కింగ్ ద్వారా వచ్చిన ఆదాయం కలుపుకొని ఆలయానికి 38 లక్షల 84 వేల రూపాయల ఆదాయం రావడం జరిగిందన్నారు. వచ్చిన ఆదాయం రూపాయలను అమ్మవారి అకౌంట్లో జమ చేసి, ఆలయం అభివృద్ధి కొరకు ఖర్చు చేయడం జరుగుతుందని ఈవో రంగారావు పర్యవేక్షణ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వెంకట్ రెడ్డి, గ్రామ పెద్దలు గోపాల్ రెడ్డి, సాయ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కొండల్ రెడ్డి, మధు గౌడ్, గ్రామ పెద్దలు, చిన్నలు ప్రముఖులు పాల్గొన్నారు.


ఈవో కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న దృశ్యం


జ్యోతీ ప్రజ్వలన చేస్తున్న నీలం మధు ముదిరాజ్

## బిసి కులగణనతోనే సామాజిక న్యాయం

### కాంగ్రెస్ ప్రభుత్వం వలనే ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు

### కాంగ్రెస్ నాయకులు నీలం మధు ముదిరాజ్

**పటాన్‌చెరు, మార్చి 5,ప్రభాతవార్త:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన చారిత్రాత్మక నిర్ణయం అని, ఈ బీసీ కులగణనతో ముదిరాజులకు రాజకీయంగా అవకాశాలు పెరుగుతాయని మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ కాంగ్రెస్ పార్టీ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం తొండుపల్లి శంషాబాద్ పరిధిలోని ఎంఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ముదిరాజ్ కృతజ్ఞత సభలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నీలం మధు మాట్లాడుతూ... జనాభా ప్రాతిపాదికన అన్ని వర్గాలకు రాజకీయ అవకాశాలను కల్పించాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని కొనియాడారు. బీసీ కులగణన తో బీసీలలో ముదిరాజ్ లు అగ్రభాగంలో ఉన్నారని తెలిపారు. దీంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజుల ప్రాతినిధ్యం పెరగనుందన్నారు. దీంతో మన జాతి బిడ్డలకు రాజకీయంగా మంచి రోజులు రానున్నాయని సరికొత్త నాయకులు పుట్టుక రావడానికి ఇది సదవకాశమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే ఈ మహత్తర నిర్ణయం సాధ్యమైందన్నారు. కాంగ్రెస్ సహాయం తో ఇప్పటికే ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా అడుగులు వేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.
ఈ కార్యక్రమంలో కాసాని వీరేష్, అందే బాబన్న, గుండ్లపల్లి శ్రీనివాస్, మిద్దెల సంతోష్, జగన్మోహన్,వెంకటేష్, డీఎల్ పాండు, లాలాపేట లల్లు,నీలకంఠ, వెంకటేష్, తలారి మల్లేష్, మర్రి ప్రభాకర్, ముల కనకయ్య, బలుగారి నర్సింలు, నారాబోయిన శ్రీనివాస్, సుంకరబోయిన మహేష్, ముదిరాజ్ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో ఘనంగా ప్రారంభమైన 'గస్టో'


గస్టో కార్యక్రమానికి హాజరైన ధ్యాన్ చంద్ అవార్డు గ్రహీత షబ్బీర్ అలీ

**పటాన్‌చెరు,మార్చి 5,ప్రభాతవార్త:**
గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో గస్టో2025 పేరిట నిర్వహిస్తున్న మూడు రోజుల అంతర్ విశ్వవిద్యాలయ వార్షిక క్రీడాపోటీలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. డైరెక్టరేట్ ఆఫ్ స్పోర్ట్స్ నిర్వహిస్తున్న ఈ ఉత్సాహ భరితమైన క్రీడా తత్వం, జట్టు కృషి, పోటీ స్ఫూర్తి గీతం చుట్టు పక్కల ఉన్న ఔత్సాహిక క్రీడాకారులందరినీ ఒక చోటకు చేర్చింది. ధ్యాన్ చంద్ అవార్డు గ్రహీత, భారత ఫుట్ బాల్ జట్టు మాజీ కెప్టెన్ షబ్బీర్ అలీ సాంప్రదాయ జ్యోతి ప్రజ్వలన చేసి, గస్టో2025 క్రీడా పోటీలను అధికారికంగా ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. నేను గస్టో గురించి చూసినప్పుడు, క్రీడా పోటీల నిర్వహణ కోసం గీతం పలు కమిటీలను నియమించడంచూసి ఆశ్చర్యపోయాను. గీతం విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు, వారి కుటుంబాలకే కాకుండా, వారు చదివే విద్యా సంస్థలు, దేశానికి కూడా అవార్డులు తెస్తారని నేను విశ్వసిస్తున్నాన్ను అని వ్యాఖ్యానించారు. ముఖ్యఅతిథి షబ్బీర్‌అలీని గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.నారాయణ రావు చౌదరి తదితరులు దుశ్శాలువ,జ్ఞాపికలతో సత్కరించారు. షబ్బీర్ అలీ వంటి విశిష్ట అతిథి గస్టో ప్రారంభోత్సవంలో పాల్గొనడం ముదావహమని డీవీవీఎస్ఆర్ వర్మ అన్నారు. గస్టోలో భాగంగా, క్రికెట్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, ఫుట్ బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, త్రోబాల్, చెస్, పవర్ లిఫ్టింగ్, బాస్కెట్ బాల్ వంటి ఉత్తేజకరమైన క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనేందుకు సిద్ధార్థ, ఎంజీఐటీ, ఎంఎల్ఆర్డీ, భవన్స్, లయోలా అకాడమీ, మహీంద్రా, నిక్‌మర్, కేఎల్ యూ, వీఎన్ఆర్ వీజేఐఈటీ, గీతం వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకుని, ఆయా పోటీలలో ప్రతిభను పరీక్షించుకుంటున్నారు.


లేబర్ కార్యాలయంలో వినతిపత్రం అందచేస్తున్న సిఐటియు నేతలు

## కార్మికులు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

### సిఐటియు నాయకులు

**నర్సాపూర్, మార్చి 5, ప్రభాతవార్త :** కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు నిర్ణయించి అమలు చేయాలనీ, 73 షెడ్యూల్ పరిశ్రమ జీఓలను విడుదల చేయాలనీ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నర్సాపూర్ అసిస్టెంట్ లేబర్ కార్యాలయం సబ్ ఆర్డినేటర్ విమలకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు మాట్లాడుతూ కనీసవేతనాల చట్ట సవరణ జరిగి 15 సంవత్సరాలు గడిచినా నేటివరకు తిరిగి 73 షెడ్యూల్ పరిశ్రమ జీవోలను సవరణ చేయకపోవడం కార్మికులకు తీవ్ర నష్టమని వారు గుర్తుచేశారు. 2005 నుండి నేటి వరకు పెరిగిన ఆర్థిక భారాలు, అధిక ధరల పెరుగుదలతో కొనుగోలు శక్తి లేక కార్మికులు ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. చాలి చాలని వేతనాలతో కార్మికులు విద్యా, వైద్యం అందుకోలేని పరిస్థితుల్లోఅప్పుల పాలవుతున్నారని అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మికుల అవసరాలు, కొనుగోలు శక్తి పెరగాలంటే 73 షెడ్యూల్ పరిశ్రమ జీవో లను సవరించి కార్మికులకు నేటి పరిస్థితులకు అనుగుణంగా మార్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, కృష్ణ పాల్గొన్నారు.

## ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు


సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

**బెజ్జంకి, మార్చి 5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గుగ్గిళ్ల గ్రామంలో గల సాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలతో అలంకరించి ప్రత్యేక పూజాలతో పాటు అభిషేకం,ఆలయ కమిటీ దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సాయి బాబా భజన మండలి భక్తులు, గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పాలన దినోత్సవం


స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు

**చిన్నకోడూరు, మార్చి 5, ప్రభాతవార్త :** చిన్నకోడూరు ఎంపిపిఎస్‌లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. హెచ్ఎగా నవనీత, డిఈవోగా అభినవ్, ఎంఇఒగా రోహిత్, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు విద్యబోధన చేశారు. కార్యక్రమంలో ఎంఈవో యాదవరెడ్డి, హెచ్ఎం భాస్కర్, ఉపాధ్యా యులు శివరాణి, శ్రీచరణ, కవిత, సాయిశ్రీ, కవిత, రాధిక, అజంత పాల్గొన్నారు.

## సమగ్ర శిక్షా ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

**గజ్వేల్, మార్చి 5 (ప్రభాతవార్త):** మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని మక్కరాజ్‌పేట కాంప్లెక్స్‌లో సిఆర్‌పిగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌నాయక్, శ్రీనివాస్‌లు కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఇద్దరి కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడి ఉండగా ఈ విషయం తెలుసుకున్న గజ్వేల్ ప్రాంతంలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అందరూ కలిసి ఒక లక్షా 93వేల రూపాయలను మృతిచెందిన రమేష్, శ్రీనివాస్ పిల్లల పేర్లపై ఫిక్సిడ్ డిపాజిట్ చేసి దానికి సంబంధించిన పత్రాలను బుధవారం వారి ఇంటికి వెళ్ళి జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి చేతులమీదుగా మృతుల కుటుంబసభ్యులకు అందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు ఉదయభాస్కర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటరాములు, వివిధ సంఘాల నాయకులు శశిధర్ శర్మ, మల్లికార్జున్, నరేందర్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, అమర్‌నాథ్‌రావు, రమణారావు, నర్సింహ, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, వెంకటేశం, రమేష్, యాదగిరి, లచ్చిరాంనాయక్, ఎల్లం, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## హానికర చెత్తపై అవగాహన

**నర్సాపూర్, మార్చి 5, ప్రభాతవార్త :** నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు ఆదేశాల మేరకు బుదవారం నర్సాపూర్ మున్సిపాలిటీలో 13 వ వార్డులో గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోనీ విద్యార్థినులు అందరికీ తడి, పొడి మరియు హాని కరమైన వ్యర్థాలను వేరు చేయడం గురించి అవగాహన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటెరి ఇనస్పెక్టర్ సల్ల మురళీ, మున్సిపల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది మరియు బేసిల్ ఫౌండేషన్ తెలంగాణ ఫౌండర్ ఉదయ్, మున్సిపల్ సిబ్బంది వార్డు ప్రజలు. విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.


డీసీఎంలో దగ్ధమవుతున్న గడ్డి

## డిసిఎంలో గడ్డివాము దగ్ధం

**కొల్చారం, మార్చి 5 ప్రభాతవార్త:** కొల్చారం మండల పరిధిలోని అప్పాజి పల్లి గ్రామానికి చెందిన చింతకింది కృష్ణ గడ్డి లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వాహానానికి విద్యుత్ తీగలు తగిలి గడ్డి అగ్నికి ఆహుతై, పెను ప్రమాదం తృటిలో తప్పింది. ఈ సంఘటన బుధవారం కొల్చారం మండలం కిష్టపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. డీసీఎం వాహనం కిష్టాపూర్ గ్రామ శివారులో గడ్డిని లోడ్ చేసుకొని వెళ్తున్న క్రమంలో ఘటన జరిగింది. పాఠశాలకు వెళ్తున్న విద్యార్థుల పక్కనే ఘటన జరగడంతో విద్యార్థులు పరుగులు తీశారు. డ్రైవర్ అప్రమత్తమై గడ్డిని వాహనంలో నుండి అన్‌లోడ్ చేసి పక్కనే ఉన్న కలువలోకి తీసుకెళ్లడంతో ప్రమాదం తప్పింది.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

**చిన్నకోడూరు, మార్చి 5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చౌడారం గ్రామానికి చెందిన కదారి లింగం(55) అనే వ్యక్తి మంగళవారం గ్రామ శివారులోని చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లారు. ఈ క్రమంలో చేపలు పట్టే వైరు కాళ్లకు చుట్టుకొని నీట మునిగి అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి ఎంత వెతికిన ఇంటికి రాకపోవడంతో గ్రామ శివారులోని ఎల్లమ్మజాలు చెరువులో పడి మృతి చెందినట్లు గ్రామస్తులు గుర్తించారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.



ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

## పొలాలకు సాగునీరు అందించాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సత్తిరెడ్డి

**కొమురవెల్లి, మార్చి 5,ప్రభాతవార్త :** మండలానికి తలమానికంగా ఉన్న తపస్‌పల్లి రాజర్వాయర్‌ను దేవాదుల ప్రాజెక్టు ద్వారా నింపి వరి పొలాలకు సాగునీరు అందించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ గతంలో రైతుల పోరాటాల ఫలితంగా నిర్మించిన తపస్‌పల్లి రిజర్వాయర్ కొమురవెల్లి, చేర్యాల, మద్దూరు,దూళ్‌మిట్ట మండలాల ప్రజలకు సాగు తాగునీరు అందించాలన్న ఉద్దేశ్యంతో నిర్మించారని తెలిపారు. ఈ ప్రాంత రైతుల పంట పొలాలు ఎండిపోతుంటే సర్కారు పట్టించుకోవడం లేదన్నారు. పంట పొలాలు ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. అనంతరం దేవాదుల డీఈతో ఫోన్‌లో మాట్లాడగా త్వరలో నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, ప్రశాంత్, మల్లేశం, బాలకిషన్, భిక్షపతి, యాదయ్య, నరేష్, రాజు,శ్రీకాంత్ పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

**కోహెడ, మార్చి 5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని శనిగరం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థులు పాఠశాలలోని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.సరళ, ఎపీసీ చైర్మన్ సిరికొండ శ్యామల, ఉపాధ్యాయులు వేణుగోపాల్, బాల్‌రెడ్డి, జగదీశ్వర్, శ్రీనివాస్, లక్ష్మి, కరుణశ్రీ, కరీం, రవీందర్, భాస్కర్,గణేష్, పద్మ, శారద,రమ్య, మల్లేశం, షబాన బేగం, రాణి, సిఆర్‌పిలు రాజేశం, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనం తిరిగే ప్రదేశంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌యాదవ్



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, మార్చి 5, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లలో భాగంగా చిన్నకోడూరులో ఇందిరమ్మ మోడల్ ఇళ్లు నిర్మిస్తున్న ప్రదేశాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీసం మహేందర్‌యాదవ్ కార్యకర్తలతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ మోడల్ ఇళ్లను తహసీల్దార్ ఆఫీస్ ప్రాంగణంలో ఉన్న ఐకెపి భవనం పక్కన ఇరుకుగా ఉన్న ప్రదేశంలో తూతూ మంత్రంగా నిర్మించి చేతులు దులుపుకునే ప్రయత్నం అధికారులు చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే జనం తిరిగే ప్రదేశంలో నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపట్టడానికి స్థలం కేటాయించాలని కోరుతూ తహసీల్దార్, ఎంపిడిఓ కార్యాలయాల్లో వినతి పత్రం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పొన్నాల రాజేష్, కొమ్ము ప్రశాంత్, భూపతిరెడ్డి,గుండు వెంకట్, నముండ్ల వినోద్, జక్కుల నాగరాజు,పెరబోమిన కనకరాజు,కొమ్ము ఎల్లయ్య,ఇరుమల ఎల్లయ్య పాల్గొన్నారు.

## అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ



మాట్లాడుతున్న ఎస్ఐ

**అక్కన్నపేట, మార్చి 5,ప్రభాతవార్త:** అపరిచిత వ్యక్తుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ విజయ్‌భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని జనగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థుల చట్టాలు,మహిళా చట్టాలు,సైబర్ నేరాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, గంజాయి, సిసి కెమెరాలు, ఈవి టీజింగ్, నూతన చట్టాలను గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చదువుకు సమయం కేటాయిస్తే భవిష్యత్తులో బాగు పడతారని లేదంటే జీవితాంతం ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు అకతాయిల అల్లర్లు,పొగడ్తలకు పడిపోయి మోసపోవద్దన్నారు. విద్యార్థి తల్లితండ్రుల కష్టాలను మరిచిపోవద్దన్నారు.ఎవరూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని,నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరికైనా ఏదైనా సమస్య ఏర్పడితే వెంటనే డయల్ 100 లేదా 8712667434 నంబర్లకు ఫోన్ చేసి పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి,, షీటీమ్ బృందం సదయ్య, ప్రశాంతి, కృష్ణ పాల్గొన్నారు.

## ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు

**హుస్నాబాద్ టౌన్, మార్చి 5, ప్రభాతవార్త :** పట్టణంలో ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో బుధవారం రోజున ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.అనంతరం ఆటల పోటీలు నిర్వహించి పోటీలో గెలిసిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు గౌరిశెట్టి సునీత, ప్రధాన కార్యదర్శి భాగ్య,కోశాధికారి రాధిక, హేమలత, లత, రాణి, తంగళ్ళపల్లి రాణితో పాటు తదితరులు ఉన్నారు.



సంబరాలు చేసుకుంటున్న మహిళలు

# ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం



పరీక్షా కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు





నర్సాపూర్‌లో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

**హుస్నాబాద్ టౌన్, మార్చి 5, ప్రభాతవార్త**

ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలు మొదటి రోజు కావడంతో విద్యార్థులు సమయానికి ముందే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. కేంద్రానికి వచ్చిన విద్యార్థులను అధికారులు తనిఖీలు నిర్వహించిన తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని రకాల చర్యలు చేపట్టారు.హుస్నాబాద్‌లో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయగా మొత్తం మూడు కేంద్రాలలో 704 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 670 మంది పరీక్షలకు హాజరుకాగా 34 మంది గైర్హాజరయ్యారు. అయితే పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాలలో 202 మంది విద్యార్థులకు 198 హాజరైనట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సదాశివ, బాలికల కళాశాలలో 239కి 219 మంది హాజరైనట్లు ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ రవీందర్, ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో 263కి 253 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ విశ్వనాథ్ తెలిపారు. ఈ ఏడాది సిసి కెమేరాల మధ్య పరీక్షలు జరుగుతున్న సందర్భంగా విద్యార్థులకు ముందుగానే పరీక్ష రాసే విధానం గురించి అధికారులు అవగాహన కల్పించగా మొత్తాని మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంత వాతావరణంలోనే జరిగినట్లు వారు వివరించారు.

**నర్సాపూర్‌లో...**

**నర్సాపూర్, మార్చి 5. ప్రభాతవార్త :** పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నర్సాపూర్‌లో ఇంటర్మీడియట్ పరీక్షల కోసం నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మైనార్టీ జూనియర్ కళాశాల, అల్లూరి సీతా రామరాజు గురుకుల పాఠశాల. ఎల్లంకి డిగ్రీ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో మొత్తం 877 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా అందులో 811 మంది హాజరై పరీక్షలను రాశారు. ఇందులో 66 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని అధికారులు తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ బి.లింగం ఆధ్వర్యంలో పోలీసుల గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు. ఈ మేరకు నర్సాపూర్‌లోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా సజావుగా కొనసాగాయి.



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న గౌడ సంఘం సభ్యులు

## వైభవంగా శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణం

**వర్గల్, మార్చి 5 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలలో భాగంగా శ్రీరేణుకఎల్లమ్మ జమదగ్ని మహాముని కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను ఊరేగించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కళ్యాణ వేదికపై అధిష్టింపజేశారు. అనంతరం రెండు గంటల పాటు జరిగిన కళ్యాణ మహోత్సవంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. కాగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అయితే గ్రామాల్లో ప్రకృతికి ప్రతిరూపాలుగా గ్రామ దేవతలను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తుండగా, అమ్మవారి ఆశీస్సులతో పిల్లా పాపలు సంతోషంగా ఉంటారని, పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఏటా ఉత్సవాలు నిర్వహిస్తుండగా, గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తాళ్ల ప్రభుదాస్‌గౌడ్, మక్తాల యాదగిరిగౌడ్, గజ్వేల్ బాలకిషన్ గౌడ్,కొండల్‌గౌడ్, మహేందర్‌గౌడ్,జహంగీర్‌గౌడ్,తౌటి కిష్టయ్యగౌడ్ పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి ఆపన్నహస్తం

**ములుగు, మార్చి 5 (ప్రభాతవార్త):** అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఓ పేద కుటుంబానికి శ్రేయోభిలాషి సేవా ట్రస్టు సభ్యులు ఆపన్నహస్తం అందించారు. తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన జామకాయల కనకయ్య ఇటీవల అకస్మాత్తుగా చనిపోవడంతో ఆయన భార్య పుణ్యవతి కాళ్ళు చేతులు చచ్చుబడి అనారోగ్యంతో కొట్టుమిట్టాడుతుంది. ఆమెకు భర్తనే సేవలు చేసేవాడు కాగా ఆయన మరణంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. విషయం తెలుసుకున్న శ్రేయోభిలాషి సేవా ట్రస్టు సభ్యులు రూ.15వేల నగదు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో శ్రేయోభిలాషి సేవా ట్రస్టు గౌరవ అధ్యక్షుడు విష్ణుజగతి, ప్రధాన కార్యదర్శి పోరెడ్డి మల్లేశం, కోశాధికారి గంప ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శి మొగలి రాజశేఖర్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు, గ్రామ నాయకులు కరుణాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

**నర్సాపూర్, మార్చి 5, ప్రభాతవార్త :** ప్యారానగర్ శివారులో ఏర్పాటు చేస్తున్న డంపుయార్డును ఎత్తివేసి నర్సాపూర్ ప్రాంతాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తు అఖిలపక్షం నాయకుల అధ్వర్యంలో రిలే నిరహార దీక్షలను నిర్వహించారు. బుధవారం చేపట్టిన దీక్షలో బీజేవైఎం జిల్లా నాయకులు వాల్దాస్ అరవింద్ గౌడ్, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు ఎర్రగుల్ల రమేష్‌యాదవ్ ఆధ్వర్యంలో రిటైర్మెంట్ ఉద్యోగులు, బీజేవైఎం నాయకులు కార్యకర్తలు ఈ రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సాపూర్ ప్రాంతాన్ని,అడవిని కలుషితం చేసే జీహెచ్‌ఎంసి డంపింగ్ యార్డ్‌ను వెంటనే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ డంపు యార్డుతో నర్సాపూర్ రాయరావ్ చెరువు కలుషితం అవడమే కాకుండా పరిసర గ్రామ ప్రాంతాలైన గుమ్మడిదల, నల్లవల్లి, ప్యారా నగర్ తదితర గ్రామాల్లో వాతావరణం కలుషితమై పోతుందని అన్నారు. దీంతో ఈ గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలవుతారని అన్నారు. ప్రజలకు వాతావరణానికి ముప్పు కల్పించే ఈ డంప్ యార్డును ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ రిలే నిరాహార దీక్షలో బీజేవైఎం జిల్లా నాయకులు వాల్‌దాస్ అరవింద్ గౌడ్. బిజెపి నాయకులు ఎర్రగొల్ల రమేష్‌యాదవ్, రిటైర్మెంట్ ఉద్యోగులు సిరుమని గంగార , బీజేవైఎం నాయకులు పోతరాజు అనిల్, రిటైర్మెంట్ ఉద్యోగులు, బీజేవైఎం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న అఖిల పక్షం నాయకులు





మాట్లాడుతున్న టియుజెఎసి చైర్మెన్ సుల్తాన్ యాదగిరి

## మిలియన్ మార్చ్ డేను జయప్రదం చేద్దాం

### టియుజెఎసి చైర్మన్ సుల్తాన్ యాదగిరి

**రామాయంపేట, మార్చి 5, ప్రభాతవార్త :** గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డే ను జయప్రదం చేయాలని టియుజేఏసీ చైర్మెన్ సుల్తాన్ యాదగిరి పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన కరపత్రంను ఆయన బుధవారం రామాయంపేటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుల్తాన్‌యాదగిరి మాట్లాడుతూ 2011 మార్చి 10న సీమాంధ్ర దోపిడీ పాలనపై తెలంగాణ ప్రజలు తిరుగుబాటు జెండా ఎత్తిన రోజని, తెలంగాణ ప్రజలు తెగించి తెగువతో పోరాడారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను, ఉద్యమకారుల కోడును మాజీ సీఎం కేసీఆర్ విస్మరించి తెలంగాణను విధ్వంసం చేశాడని మండిపడ్డారు. టియుజేఏసీ సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 250 గజాల ఇంటి స్థలం, రూ.30000 గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు పాతూరి రమేష్‌గౌడ్, ఉద్యమకారుల జెఎసి నాయకులు ఎర్ర దుర్గం, పంబాల శ్రీనివాస్, జేఏసీ రాష్ట్ర నాయకులు తుల్జరెడ్డి, లక్ష్మికాంతమ్మ, పి. లక్ష్మి, అన్వర్ పటేల్, టియూకేవి అధ్యక్ష, కార్యదర్శులు పెద్ద యాదగిరి, డోలక్ యాదగిరి, గంగారాం, పి. శ్రీనివాస్, నర్సగల్ల పెద్దస్వామి, చర్పల చంద్రన్న ప్రసాద్, కొమ్ము శంకర్, తాళ్లపల్లి ఎల్లం, కె. రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 9 నుంచి శ్రీ కలెట్ల మల్లికార్జున స్వామి జాతర

**నర్సాపూర్, మార్చి 5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నారాయణపుర్ గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఈ నెల 9 నుండి 13 వరకు నాలుగు రోజులపాటు శ్రీకలెట్ల మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ జాతర మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 9న హోమం, గంగకు వెళ్ళుట. 10 న దేవునికి కొట్నం పెట్టుట, గంపల ఊరేగింపు, సాయంత్రం శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణం, గొలుసు తెంపుట, బోనాల ఊరేగింపు, 11న నాగవల్లి, బండి షిడి ఊరేగింపు, నిండు బండ్లు ఊరేగింపు, 12న ఒగ్గు కథలు, సాయంత్రం పాచి బండ్లు ఊరేగింపు వంటి వాటితో పాటు శ్రీ మల్లికార్జున స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతిరోజు రాత్రి ఒగ్గు కథ కాలక్షేపం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ జాతర ఉత్సవాలకు పరిసర గ్రామాల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**వర్గల్, మార్చి 5 (ప్రభాతవార్త):** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన వర్గల్ మండలం నాచారం గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వర్గల్ మండలకేంద్రానికి చెందిన పసుల లింగం(50) అనే వ్యక్తి మంగళవారం పని నిమిత్తం తూప్రాన్‌కు తన ఇన్నోవా వాహనంలో వెళ్ళి తిరిగి రాత్రి 10.40 గంటల సమయంలో వర్గల్‌కు వస్తుండగా అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో నాచారం గ్రామ శివారులోని సిరి విత్తనాల కంపెనీ ముందు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టాడు. దీంతో లింగంకు బలమైన గాయాలు కావడంతో సమాచారం అందుకున్న 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఆర్‌విఎం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతునికి భార్య యాదమ్మ, ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

# విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

### జిల్లా గ్రంధాలయ చైర్మన్ లింగమూర్తి



విద్యార్థుల ప్రదర్శనలు పరిశీలిస్తున్న లింగమూర్తి, ఉపాధ్యాయులు

**హుస్నాబాద్ టౌన్, మార్చి 5, ప్రభాతవార్త**

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని జిల్లా గ్రంధాలయ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. గురువారం పట్టణంలోని కేరళా ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థుల చేసిన ప్రదర్శనలను పరిశీలించారు. విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్‌ఫెయిర్ ఉపాయోగపడుతుందన్నారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి బండారి మనీల మాట్లాడుతూ చదువు కేవలం ఉద్యోగం కోసమే కాదని, జ్ఞానంతోపాటు దేశ అభివృద్ధి కోసం ఉపయోగపడాలన్నారు.మనిషి నిద్రచేసింది మొదలుకుని పడుకునే వరకు చిన్న చిన్న మిషన్ల నుండి స్పేస్ రిసెర్చ్ వరకు ఎన్నో అంతుచిక్కని రహస్యాలను చేదించిన సైన్స్ అని భారత భౌతిక శాస్త్రవేత్త అయిన చంద్రశేఖర్ వెంకటరామణ్ రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్న సందర్భంగా సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆయనకు భారత రత్న అవార్డుతో సత్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, మాజీ కౌన్సిలర్లు, పాఠశాల చైర్మెన్ బుర్ర రాజేందర్, కరస్పాండెంట్ అల్లి శైలేందర్, అధ్యాపకులు,తల్లితండ్రులు ఉన్నారు.

**చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలి**

**హుస్నాబాద్ రూరల్, మార్చి 5,ప్రభాతవార్త**

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా గ్రంధాలయ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. గురువారం పట్టణంలోని సర్ సివిరామన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లింగమూర్తి మాట్లాడుతూ విద్యార్థులలో శారీరక ఎదుగుదలకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటే విజయతీరాలు చేరుకుంటారన్నారు.అనంతరం పాఠశాలలో నిర్వహించిన క్రీడాపోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్ర మంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ సుద్దాల చంద్రయ్య, గురుకుల పాఠశాల ఉపాన్యాసకులు వెంకయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాయిత నారాయణరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



శివారు వెంకటాపూర్‌లో స్వయంపాలన జరుపుకున్న విద్యార్థులు

## శివారువెంకటాపూర్‌లో విద్యార్థుల స్వయంపాలన

**మర్కుక్, మార్చి 5 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని శివారువెంకటాపూర్ గ్రామ ఎంపియుపిఎస్ పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టర్‌గా సిహెచ్.ఇందు, డీఈఓగా అజయ్, ఎంఈఓగా కనకలక్ష్మి, ప్రధానోపాధ్యాయులుగా దీపిక, ఉపాధ్యాయులుగా కారుణ్య, వర్షిణి, ఝాన్సీ, మైథిలి, శ్రావణి, కావ్య, మనోజు, కార్తిక్, విష్ణువర్ధన్, పీఈటీలుగా అనిల్, అభిలాష్‌లు వ్యవహరించారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థులకు విద్యాబోధన చేసి ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శంకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు జీవిత లక్ష్యాన్ని ఏర్పర్చుకొని ఆ లక్ష్యాన్ని సాధించే వరకు నిరంతరం శ్రమస్తే తప్పకుండా విజయాన్ని సాధించగలరని తెలిపారు. అనంతరం స్వయంపాలనలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కొత్త నరసింహారెడ్డి, తుమ్మ కుమార్, మధు, ముతనతయ్య, సృజన, పద్మజ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకున్న విద్యార్థులు

**జగదేవ్‌పూర్, మార్చి 5 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేయడం జరిగింది. కలెక్టర్‌గా రాహుల్, డీఈఓగా ఫర్హాన్, ఎంఈఓగా రాజేష్, ప్రధానోపాధ్యాయులుగా వర్షిణి, పీఈటీలుగా రక్షిత, సుహాన, ఉపాధ్యాయులుగా ధనలక్ష్మి, వందన, అక్షర, రవళి, దీపిక, భావన, పూజ, సాహిత్య, సారిక, రిషిక, రిషితశ్రీ, అక్షయ, తరుణ్, తనిష్, కేశవ, లక్ష్మికాంత్, సాయిగనిచరణ్, నవనీత, ప్రతిష్ట తదితరులు వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఇంటర్వ్యూలకు హాజరైన 128 మందికి ఉద్యోగాలు



క్యాంపు కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ రూరల్, మార్చి 5, ప్రభాతవార్త :** ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపుకార్యాలయంలో ఇండిగో విమానయాన సంస్థలో డ్రైవర్లు, లోడర్ల నియామకానికి ఏజిల్ సంస్థ బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటర్వ్యూకు 129 మంది హాజరుకాగా అందులో హెవీ మోటర్ వెహికల్ డ్రైవర్లుగా 60 మంది,లైట్ మోటర్ వెహికల్ 25 మంది డ్రైవర్లుగా,లోడర్లు, టెక్నీషియన్లుగా 43 మందిని ఉద్యోగాల కోసం ఎంపిక చేయడం జరిగిందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

## ఢిల్లీ సిఎం ఎన్నికల పట్ల వైశ్య సంఘం నేతల హర్షం



మాట్లాడుతున్న కిరాణా వర్తక సంఘం నాయకులు

**గజ్వేల్ టౌన్, మార్చి 5(ప్రభాతవార్త):** ఢిల్లీ సిఎంగా ఆర్యవైశ్య మహిళకు అవకాశం దక్కడం ఎంతో సంతోషకరమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు సిద్ది బిక్షపతిగుప్త అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీ సిఎంగా ఆర్యవైశ్య మహిళకు అవకాశం కల్పించడం హర్షించదగ్గ విషయమని, దేశ ప్రధాని నరేంద్రమోడికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఆర్యవైశ్యులు అన్ని రంగాలలో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కిరాణా వర్తక సంఘం సభ్యులు దూబకుంట మెట్రాములు, కాపర్తి వెంకటేశం, శ్రీనివాస్, మర్యాల లింగం, ప్రభాకర్, దూబకుంట లక్ష్మణ్, రాము, కైలాస శ్రీనివాస్, ఎన్.వి.ప్రసాద్, రాజప్ప పాల్గొన్నారు.

## క్రీడలు నిర్వహించడం హర్షణీయం

**ములుగు, మార్చి 5 (ప్రభాతవార్త):** ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలే కాకుండా క్రీడా కార్యక్రమాలను ప్రోత్సహించడం, నిర్వహించడం హర్షణీయమని శ్రేయోభిలాషి సేవా ట్రస్టు సలహాదారు, తెలంగాణ రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సిరంశెట్టి సోమేశ్వరరావు అన్నారు. బుధవారం ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో ట్రస్టు కిట్టి పార్టీ కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన శ్రేయోభిలాషి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నివాసముండే ఓ పేద కుటుంబానికి ఆయన చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజన్-7లో భాగంగా విజన్-2 శ్రేయోభిలాషి సేవా ట్రస్టు ద్వారా సామాజిక సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలే కాకుండా క్రీడా పోటీలు కూడా ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. ఈ సందర్భంగా ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు విష్ణుజగతి మాట్లాడుతూ సభ్యులు అందరి సహకారంతో శ్రేయోభిలాషి సేవా ట్రస్టు సంస్థను సేవా కార్యక్రమాలలో ముందుకు తీసుకెళ్తున్నానని, విజన్-1లో భాగంగా గత ఫిబ్రవరి నెలలో సుమారు 1200 మంది పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు మోటివేషన్ చేయడం జరిగిందన్నారు. ఏప్రిల్ నెలలో విజన్-2లో భాగంగా యువతతో పాటు విద్యార్థులను క్రీడలు, ఆటలలో ప్రోత్సహించడం జరుగుతుందని వెల్లడించారు.

అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన స్థానిక విలేకరులను, ఆత్మీయ అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రధాన కార్యదర్శి పోరెడ్డి మల్లేశం, కోశాధికారి గంప ఆంజనేయులు, జాయింట్ సెక్రటరీ మొగిలి రాజశేఖర్‌రెడ్డి, ఆకుల సుధాకర్, ఆకుల శ్రీరాములు, విజయేందర్‌రెడ్డి, పురుషోత్తం, కొడాలి చంటి, సభ్యులు పాల్గొన్నారు.

## ఎంగేజ్‌మెంట్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**మనూర్, మార్చి 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మైకోడ్ గ్రామ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు చంద్రకాంత్ కుమార్తె నిశ్చితార్థం వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొని ఆశీర్వదించారు.మాజీ ఎమ్మెల్యే వెంట మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు విఠల్‌రావు పాటిల్ మాజీ సర్పంచ్ సుధాకర్, శివకుమార్, కృష్ణ, సంగప్ప తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి వెంకట్‌రెడ్డి

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డిఎస్‌పి

**నారాయణఖేడ్, మార్చి 5, ప్రభాతవార్త:** ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొడక్షన్ కౌన్సిల్ 2025 సంవత్సరం క్యాలెండర్‌ను డిఎస్‌పి వెంకట్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బాధితుల పక్షాన న్యాయానికి ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొడక్షన్ కౌన్సిల్ బాధ్యులు పనిచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ ఉమెన్ రైట్స్ ప్రొడక్షన్ కౌన్సిల్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డిఓ ప్రకాష్, మెదక్ జిల్లా బాధ్యులు సంతోష్‌రావుపాటిల్, బిసి సంఘం అందోల్ డివిజన్ అధ్యక్షులు రాజశేఖర్, శ్రీనివాస్, అవుటి దత్తు, డిఎసపి రైటర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం : మున్సిపల్ కమిషనర్

**నారాయణఖేడ్, మార్చి 5, ప్రభాతవార్త:** పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అన్నారు. బుధవారం పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద మురుగు కాల్వలను పరిశుభ్రం చేస్తున్న తీరును కమీషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసు పరిశీలించారు. మున్సిపల్‌పరిధిలోని ఆయా వార్డుల్లో మురుగు కాల్వల్లో చెత్తాచెదారం నిల్వ ఉండకుండా ఎప్పటికి అప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులకు సూచించారు. ఇళ్ల యజమానులు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు.

## మార్కండేశ్వర ఆలయానికి శిఖర ప్రతిష్టాపకు సర్వం సిద్ధం



మార్కండేశ్వర ఆలయంలో విగ్రహాల ప్రతిష్టాపన దృశ్యం

**నారాయణఖేడ్, మార్చి 5, ప్రభాతవార్త:** పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తాలోని మార్కండేశ్వర ఆలయంలో విగ్రహాల ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు నాలుగు రోజులుగా నేత్ర పర్వంగా కొనసాగుతున్నాయి. పద్మశాలిల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పూజా కార్యక్రమాలకు నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని వీక్షిస్తున్నారు. భక్తులకు నిత్యం అన్నదాన వితరణ నిర్వహిస్తున్నారు. ఈ నెల 6వ తేదీన మార్కండేశ్వర ఆలయ శిఖర ప్రతిష్టాపన కార్యక్రమానికి రంగంపేట పీఠాధిపతులు మాధవానంద సర్వస్వతి మహారాజ్, కరణ్ గజేంద్ర భారతి మహారాజ్, యదీశ్వరులు, మునులు, సాధుసంతులు హాజరవుతున్నట్లు నిర్వహకులు పేర్కొన్నారు.

## అంతర్గామలో ప్రారంభమైన అఖండ సప్తహా



అఖండ హరినామ సప్తను ప్రారంభిస్తున్న శ్రీకరణ గజేంద్ర భారతి

**సిర్గాపూర్, మార్చి 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అంతర్గామ గ్రామంలో శ్రీఅఖండ హరినామ సప్త కార్యక్రమాన్ని శ్రీకరణ్ గజేంద్రభారతి మహారాజ్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని రుక్మిణ పాండురంగలకు అభిషేకం పూజలు నిర్వహించి 375 మంది భక్తులతో సంతు జగద్గురు తుకారం మహారాజ్ గాథ పారాయణం ప్రారంభించారు. ఈ సందర్భంగా కరణ్ గజేంద్ర భారతి మహారాజ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మనసుకు ప్రశాంతంగా దక్కుతుందని ఫలితంగా సర్గరోగ నివారణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అవధూత్ మహారాజ్, జ్ఞానేశ్వర్ మహారాజ్, ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి ఎంపిడివోకు సన్మానం

**అల్లాదుర్గం, మార్చి 5, ప్రభాతవార్త:** మూడు సంవత్సరాల పాటు ఇన్



బదిలీపై వెళుతున్న శంకర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

చార్జి ఎంపిడిఓ కె.శంకర్ అందించిన సేవలు చిరస్మరణీయమని మండల పరిషత్ ఉద్యోగులు అన్నారు. శంకర్ బదిలీ అయిన సందర్బంగా ఎంపిడిఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వీడ్కోల సమావేశం నిర్వహించి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అందరి సహకారంతో మూడేళ్లు మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయగలిగానని బదిలీపై వెళుతున్న శంకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపిఓ సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ సజ్జత్‌అలీ, పంచాయితీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**అల్లాదుర్గం, మార్చి 5, ప్రభాతవార్త:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి కరుణాకర్ సూచించారు. బుధవారం అల్లాదుర్గంలోని కేజీవీబి, జిల్లా పరిషత్ ఉన్నత బాలకల పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను కరుణాకర్ పరిశీలించారు. ఆయా పాఠశాలల పరిసరాలను కరుణాకర్ పరిశీలించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండే వంట గదిని, భోజనం వండే కూరగాయలను పరిశీలించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ నాణ్యత లేని భోజనం పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెను ప్రకారం విద్యార్థులు భోజనం అందచేయాలని ఆదేశించారు. కేజీబీవీ జూనియర్ కళాశాలను సందర్శించి నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ చంద్రశేఖర్, పంచాయితీ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.



కెజిబివిలో వంట గదిని పరిశీలిస్తున్న ఎంఇవో కరుణాకర్

# కనీస వేతనాల పెంచాలని సిఐటియు ఉద్యమం

### రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

**జహీరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:** పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేయనున్నట్లు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు సూచించారు. బుధవారం పట్టణంలోని మహీంద్ర ట్రాక్టర్ పరిశ్రమలో సిఐటియు కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా చుక్కారాములు మాట్లాడుతూ వేతనాలు సరిపోక కార్మికులు నిత్యం అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 11 సంవత్సరాలు పూర్తయినా కనీసం పాత జిఓల స్థానంలో కొత్త జీఓలను కూడా ఇవ్వడం లేదని విచారం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తల కోసం కార్మికులను మోసం చేయడం సిగ్గుచేటని ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. సిఐటియు ఆధ్వర్యంలో 1వ తారీఖు నుంచి 7వ తేదీ వరకు



మాట్లాడుతున్న చుక్క రాములు

పెద్ద ఎత్తున కార్మికులను సమీకరించి ఆందోళనలను చేస్తున్నామని, కార్మికుల వేతనాలు పెంచకపోతే కొత్త జిఓలు ఇవ్వకుంటే రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అందోళన కార్యక్రమాల్లో సిఐటియు కార్యకర్తలు విధిగా పాల్గొనాలని చుక్కరాములు సూచించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు గణేష్, జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్ మహిపాల్, యూనియన్ ప్రధాన కార్యదర్శి గణేష్,వర్కింగ్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, నాయకులు వంశిక్రిష్ణ, బాబు, ఇస్మాయిల్ సురేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

## ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

**అల్లాదుర్గం, మార్చి 5, ప్రభాతవార్త:** ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం అల్లాదుర్గంలోని జూనియర్ కళాశాలలో ప్రశాంతంగా ముగిసాయి. అల్లాదుర్గం జూనియర్ కళాశాల, రేగోడ్ మోడల్ స్కూల్, అల్లాదుర్గం కేజీబీవీ కళాశాల విద్యార్థులు 243 మందికి గాను 241 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తుకారం తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ మల్లయ్య తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి వసతి, ఎఎన్ఎం, మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయా లేవా అని ఆరా తీశారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి : ఎస్ఐ



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డి

**సిర్గాపూర్, మార్చి 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నల్లవాగు రెసిడెన్షియల్ కళాశాలలో బుధవారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ వెంకట్‌రెడ్డి విద్యార్థులకు ఫోక్సో చట్టం, బాల్య వివాహాల నిర్మూలన, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ క్రమ శిక్షణతో విద్యను అందుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## కడ్పల్ పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

**సిర్గాపూర్, మార్చి 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కడ్పల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపిపిఎస్ పాఠశాలల్లో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఎంఈఓ నాగారం శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి భోజనం, నీరు అందించేందుకు ఉపాధ్యాయుల ఆలోచన బాగుందని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సంజీవ్‌రెడ్డి, భూమ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, బన్సిలాల్, ఉపాధ్యాయులు, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండషన్ బాధ్యులు పాల్గొన్నారు.

## విఠల్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం

### జిల్లా సిపిఐ కార్యదర్శి ఖాలేఖ్

**శివ్వంపేట, మార్చ్ 5(ప్రభాతవార్త) :** దివంగత మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని జిల్లా సిపిఐ కార్యదర్శి ఖాలేఖ్ అన్నారు. బుధవారం మండలంలోని చిన్న గొట్టిముక్కల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి హయాంలో పేద కుటుంబాలకు ఇండ్ల స్థలాలు ఇప్పించారు. గత కొన్ని సంవత్సరాల నుండి ఇల్లులు నిర్మాణం చేసుకొని కొత్త కాలనీ పేరు పెట్టుకొని కొనసాగుతున్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి హయాంలో చేసిన సేవ కార్యక్రమాలను జ్ఞాపకార్థముగా చిన్న కొట్టి ముక్కుల గ్రామంలోని కొత్త కాలనీను విట్టల్ రెడ్డి కాలనీ గా జిల్లా సిపిఐ కార్యదర్శి ఖాలేఖ్ విట్టల్ రెడ్డి కాలనీను ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ద్విగంగత విటల్ రెడ్డి పేద ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూ ప్రజలకు మేలు జరిగే విధంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని విట్టల్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ ఆయన అడుగుజాడల్లో నడుస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బిక్షపతి రావు, కిషన్, రాములు, లచ్చుల్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



విఠల్‌రెడ్డి పేరుతో కాలనీ ప్రారంభిస్తున్న జిల్లా సిపిఐ కార్యదర్శి ఖాలేఖ్

## గ్రామాల అభివృద్ధికి కృషి : మాజీ ఉప సర్పంచ్

**నర్సాపూర్ రూరల్, మార్చి 5,ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రెడ్డిపల్లి మాజీ ఉప సర్పంచి అశోక్ గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధి రెడ్డిపల్లి గ్రామంలో వీధీ దీపాలను ఆయన పంపిణీ చేశారు. తనకు ఉన్న దాంట్లో ఏదైనా చేయాలనే తపనతో గ్రామంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడు. ప్రజలకు అందుబాటులో ఉంటూ చిన్న,పెద్దా ఏదైనా సమస్య వస్తే ఇంటికి పెద్దకొడుకులా ముందుండి వారి సమస్యలను పరిష్కరిస్తున్నాడు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో గడ్డం శేఖర్, ఎర్ర రాజయ్య, లక్ష్మణ్‌గౌడ్, ప్రశాంత్, తాజామాజీ సర్పంచి రవి, గ్రామ పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఐ చల్లా రాజశేఖర్

**న్యాల్‌కల్, మార్చి 5, ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎస్ఐ చల్లారాజశేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్‌లో వచ్చిన లింకులను క్లిక్ చేయకూడదని, ఎదుటి వారికి ఓటిపిలు, ఆదర్‌కార్డు వివరాలు చెప్పకడదన్నారు.సైబర్ నేరాలకు గురయితే వెంటనే పోలీసు ఠాణాకు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ నేరాలతో పాటు పలు చట్టాలపై విద్యార్థులకు ఎస్ఐ అవగాహన కల్పించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నమూనాల పరిశీలన



ఈరక్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నమూనాను పరిశీలిస్తున్న అధికారులు

**నాగల్‌గిద్ద, మార్చి 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఈరక్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నమూనాలను అధికారులు బుధవారం పరిశీలించారు. గ్రామానికి గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ చలపతిరాము, ఎంపిడిఓ మహేవ్వర్‌రావు చేరుకుని ఇండ్ల నమూనాలు పరిశీలించారు. గ్రామంలో కొనసాగుతునన ఉపాధి హామి పథకం పనులను అధికారులు పరిశీలించారు. ఈ సందర్బంగా ఎంపిడిఓ మహేశ్వర్‌రావు మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఉపాధి కూలీలు తగు జాగ్రత్తలు తీసుకుంటూ పనులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఈ సురేష్, ఉపాధి హామి సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పాలన దినోత్సవం

**నర్సాపూర్, మార్చి 5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలోగల ప్రాథమిక పాఠశాలలో బుదవారం ప్రధానోపాధ్యాయులు కె.రవి కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఘనంగా స్వయం పాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రధాన ఉపాధ్యాయులుగా శివరాం, ఉపాధ్యాయులుగా భరత్, వర్షాంత్, ఆదిత్య, అభిరామ్, చరణ్, తేజశ్రీ, గణేశ్ లు వ్యవహరించారు.ఈ పాఠశాలలోని విధ్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన తీరు పలువురిని ఎంతగానో ఆకట్టుకుంది. పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రవికుమార్, ఉపాధ్యాయులు కృష్ణ. సత్యనారాయణ పాల్గొని విద్యార్థులను అభినందించారు.



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

# కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి సాయిలు

**చౌటకూరు, మార్చి 5, ప్రభాతవార్త:** కార్మికులపై ప్రభుత్వానికి ఎందుకింత నిర్లక్ష్యమని సిఐటియు జిల్లా నాయకులు జి.సాయిలు ప్రశ్నించారు. ఈ నెల 7న కలెక్టరేట్‌వద్ద షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ కనీస వేతనాల జీవోలను సవరించాలని, కనీస వేతనం సాధనకై నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పరిధిలోని శివంపేట గ్రామ శివారులోని సిబిఎల్ పరిశ్రమ కార్మికులకు కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా సిఐటియు జిల్లాకార్యదర్శి జి.సాయిలు, ఉపాధ్యక్షులు పి భాగరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు డ్రాఫ్ట్ జీవోలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్చి 7వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా క్యాంపెయిన్ జరుగుతోందన్నారు. రాష్ట్రంలో కోటి 20 లక్షల మంది, జిల్లాలో



శివంపేట సిబిఎల్ పరిశ్రమ కార్మికులకు కరపత్రాలు అందచేస్తున్న సిఐటియు నాయకులు

5 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడం లేదని విచారం వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల పాలనలో కార్మికులను పట్టించుకున్న పాపానపోలేదని విమర్శించారు. కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఎన్నికల సందర్బంగా హామీలు గుప్పించిన కాంగ్రెస్ పార్టీ సంవత్సరం దాటినా చేసిన హామీలను అమలు చేయడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఈ నెల 7న కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ప్రసన్నరావు, దేవరాజ్, విఠల్, లక్ష్మణ్, సురేష్, రమేష్, చంద్రయ్య, కార్మికులు పాల్గొన్నారు.



జేఎన్టీయూ కళాశాలలో సైన్స్‌డేను ప్రారంభిస్తున్న దృశ్యం

## జెఎన్‌టియులో ఘనంగా సైన్స్ దినోత్సవం

**పుల్‌కల్, మార్చి 5, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని సుల్తాన్‌పూర్‌లోని జేఎన్టీయూ కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగం, ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో బుధవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్బంగా ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహా మాట్లాడుతూ సైన్స్ మానవ పురోగమనానికి ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. సిఆర్‌సి చైర్మన్,హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సివి రామన్ ఎఫెక్ట్ (పదార్థం ద్వారా ఫక్షటాన్ల తాత్కాలిక విక్షేపణం) ఆవిష్కరణకు గుర్తుగా ఫిబ్రవరి 28న సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటూ వస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ఆచార్య రాఘవేందర్‌రావు, విభాగాధిపతులు ఆచార్య రజనీస్, ఆచార్య జోషి శ్రీపాద్, ఆచార్య బేబి శాలిని, ప్రథమ సంవత్సరం విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్లాపూర్‌లో ఉపాధ్యాయులైన విద్యార్థులు



ఎల్లాపూర్‌లో స్వయం పాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**పాపన్నపేట, మార్చి 5, ప్రభాతవార్త:** ఎల్లాపూర్ గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బుధవరం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కలెక్టర్‌గా ఆయేషా, అడిషనల్ కలెక్టర్‌గా చరణ్, డీఈఓగా కిరణ్, ఎంఈఓగా బద్ది మనస్విని, ప్రధానోపాధ్యాయులు సహస్ర, ఉపాధ్యాయులుగా పలువురు విద్యార్థులు విధులు నిర్వహించారు.

**గాంధారిపల్లిలో...**



గాంధారిపల్లిలో స్వపరిపాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**పాపన్నపేట, మార్చి 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గాంధారిపల్లి పాఠశాలలో విద్యార్థులు బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డిఈఓగా వెంకటేష్, ప్రధానోపాధ్యాయులుగా భరత్‌కుమార్, ఉపాధ్యాయులుగా శాన్విఅనన్య, జేసిక, దీక్షిత్, హరికృష్ణ వ్యవహించి తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ససర్వన్, వీరయ్య, రుకుంబయి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దత్తురెడ్డి, విక్రమ్‌గౌడ్, ఉపాధ్యాయులు వరలక్ష్మి, జయవర్ధన్‌సింగ్, ఆనగరాణి బహుమతులు అందచేశారు.

**మాణిక్‌ప్రభు పాఠశాలలో...**



మాణిక్‌ప్రభుపాఠశాలలో స్వయంపరిపాలన జరుపుకంటున్న విద్యార్థులు

**జహీరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:** పట్టణంలోని మాణిక్‌ప్రభు పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డీఈఓగా శ్వేత, ఎంఈఓగా గాయత్రి, ప్రిన్సిపాల్‌గా విగ్నేష్, ఉపాధ్యాయులుగా పలువురు విద్యార్థులు విధులు నిర్వహించి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య బహుమతులు అందచేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కల్పన, నాగలక్ష్మి, శివశంకర్, అనిత, సువర్ణ సోని, లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**చందంపేట ప్రాథమిక పాఠశాలలో...**



ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు

**చిన్నశంకరంపేట, మార్చి 5,ప్రభాతవార్త:** మండల పరిధి చందంపేట, సంగాయపల్లిలోని ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం విద్యార్థులు స్వయం పాలన జరుపుకున్నారు. డీఈవోలుగా సుమన్, మణికంఠ, మండల విద్యాధికారులుగా ప్రవీణ్, శ్రీనిధి, ప్రధానోపాధ్యాయులుగా స్రవంతిక, నందు వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, శ్రీధర్, సంతోష్ ,నవిత పాల్గొన్నారు.

## 7న ఖేడ్ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళ

**నారాయణఖేడ్, మార్చి 5, ప్రభాతవార్త:** ఈ నెల 7వ తేదీన పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణ తెలిపారు. వల్‌పల్లి మండలంలోని పార్వతమ్మ ఫ్యూచర్ ఎనర్జిస్ ప్రయివేట్ లిమిటెడ్‌లో అగ్రికల్చర్ ఫీల్డ్ ఎగ్జిక్యటీవ్ ఆఫీసర్స్ పోస్టులను భర్తీ చేయనున్నారన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన పురషులు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు గూగుల్ స్కానర్ ద్వార తమ ధరఖాస్తులు పూర్తి చేసి మేళాకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ నారాయణ సూచించారు.

## భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**చిన్నకోడూరు, మార్చి 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మాచాపూర్ గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కొయ్యడ చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబానికి గ్రామ సుతారి సంఘం సభ్యులు రూ.15వేల ఆర్థిక సహాయం అందించారు. అలాగే మాజీ మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లగా మాజీ సర్పంచ్ ఏలేటీ రాజారెడ్డి రూ.3 వేల ఆర్థికసహాయం అందించారు.కార్యక్రమంలో సుతారి సంఘం అధ్యక్షుడు మచ్చ రాయమల్లు, కొయ్యడ మల్లయ్య, చుంచు బాలరాజు పాల్గొన్నారు.